క్లుప్తంగా

రహదారికి మరమ్మతు



రామడుగు పాత బ్రిడ్జిపై మట్టి పోసి మరమ్మతు చేయిస్తున్న పోలీసులు

రామడుగు: రామడుగు మోతె వాగుపై ఉన్న పాత బ్రిడ్జిపై వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని పత్రికలు, సోషల్ మీడియాలో వార్తలు రావడంతో.. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్పందించారు. రామడుగు పోలీసులను రహదారి తాత్కాలిక మరమ్మతులు చేయాలని సూచించడంతో.. రామడుగు ఎస్సై మామిడాల సురేందర్ మట్టి పోసి మరమ్మతులు చేయించారు. మాజీ ఎంపీపీ జవ్వాజీ హరీశ్, మాజీ సర్పంచ్ కోల రమేశ్ పాల్గొన్నారు.

సీఐకి సన్మానం



సీఐని సన్మానిస్తున్న నాయకులు

మానకొండూర్: మానకొండూర్ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ సదన్‌కుమార్‌ను కాంగ్రెస్ మండల నాయకులు మంగళవారం శాలువాతో సన్మానించారు. స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు రవీందర్, సంపత్‌గౌడ్, కనకం అశోక్, సురేశ్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జమ్మికుంట: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు. విలాసాగర్ గ్రామానికి చెందిన గోపగాని సందీప్ అనే వ్యక్తి మానేరు వాగు నుంచి ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా.. కోరపల్లి గ్రామం వద్ద పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు

హుజూరాబాద్‌రూరల్: పట్టణ శివారులోని కేసీ క్యాంపులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఎలాంటి అనుమతులు లేకుండా కూలగొట్టారని, దీనిపై ఇప్పటివరకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోలేదంటూ రంగాపూర్ మాజీ సర్పంచ్, బీజేపీ సీనియర్ నాయకుడు బింగి కరుణాకర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని కూల్చివేసిన వారిపై సంబంధిత సెక్షన్ కింద చర్యలు తీసుకొని ప్రభుత్వ ఆస్తిని కాపాడాలని కోరారు. కూల్చివేతలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియజేయాలని కోరుతూ సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేశారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

సైదాపూర్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మండల అధ్యక్షుడు దొంత సుధాకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మాట్లాడారు. వివిధ అనారోగ్య కారణాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రాష్ట్రంలోనే అత్యధికంగా హుస్నాబాద్ నియోజకవర్గానికి, అందులో సైదాపూర్ మండలానికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ నిధులు మంజూరు చేయించారన్నారు. సైదాపూర్ గ్రామానికి చెందిన దాసరి పవన్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని పొన్నం దృష్టికి తీసుకెళ్లగా.. రూ.2.50లక్షల సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌వోసీని మంత్రి మంజూరు చేయించారని తెలిపారు.

తైక్వాండో అకాడమీ రాష్ట్ర అధ్యక్షుడిగా యాదయ్య



జమ్మికుంట: ఇంటర్నేషనల్ తైక్వాండో అకాడమీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా జమ్మికుంట పట్టణానికి చెందిన సుంకరి యాదయ్యకు ఇంటర్నేషనల్ తైక్వాండో హెడ్ క్వార్టర్స్ కోరియా అనుబంధంగా ఉన్న అకాడమీ అధ్యక్షుడు జయంత్‌రెడ్డి హైదరాబాద్‌లో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. మార్షల్ ఆర్ట్స్ స్ఫూర్తిని నిలబెట్టి బాధ్యతతో పని చేస్తానని అన్నారు.

28న మధ్యంతర కౌన్సిల్ సమావేశం

హుజూరాబాద్: ఈనెల 28న రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం మధ్యంతర కౌన్సిల్ సమావేశం హుజూరాబాద్ యూనిట్ శాఖ అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్ పాషా అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో జరగనున్నట్లు మంగళవారం సంఘం కార్యదర్శి డాక్టర్ విష్ణుదాస్ గోపాల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో అధ్యక్షుడి తొలి పలుకులు, కార్యదర్శి నివేదిక, ఇతర విషయాలపై చర్చించనున్నట్లు చెప్పారు.

డివైడర్ కట్టి.. తిప్పలు పెట్టి..

- తారు రోడ్డు వేయకుండానే డివైడర్ ఏర్పాటు
- వర్షాలకు గుంతలమయంగా సెంట్రల్ లైటింగ్ రోడ్డు
- ఎనిమిది నెలలుగా ప్రయాణికుల అవస్థలు

విశాలంగా మారుతుందనుకున్న రోడ్డు ఇరుగ్గా మారింది. విస్తరిస్తారనుకున్న రోడ్డు గుంతలుగా మారింది. ఆహ్లాదకరంగా మారుతుందనుకున్న దారి ఆక్రమణలకు గురవుతోంది. ఎనిమిది నెలలుగా ప్రయాణికులు గోస పడుతున్నా.. అధికారులు, ప్రజాప్రతినిధులకు పట్టడం లేదంటూ చొప్పదండి పట్టణ ప్రజలు వాపోతున్నారు.



ప్రధాన రోడ్డుపై గుంతలు



బస్టాండ్ ముందు గుంతలో నుంచి వెళ్తున్న వాహనం

చొప్పదండి: పట్టణంలో రూ.33కోట్ల టీయూఎఫ్‌ఐడీసీ(తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) నిధులతో రెండేళ్ల క్రితం చేపట్టిన సెంట్రల్ లైటింగ్ పనులు పట్టణ ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులకు ప్రమాదకరంగా పరిణమించాయి. సెంట్రల్ లైటింగ్ పనులతో పట్టణ పోకడలను సంతరించుకుంటుందని భావించిన ప్రజలకు ఇప్పుడు అవే పనులు ప్రాణాంతకంగా మారాయి. ఇరుకు రోడ్డుతోపాటు గుంతలమయమైన దారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరగడం, క్షతగాత్రులు ఆసుపత్రులపాలవడం, అప్పుడప్పుడు రోడ్డు ప్రమాదాల్లో మరణాలు సంభవించడం తప్పా.. సెంట్రల్ లైటింగ్ పనులతో ఆశించిన ప్రయోజనం లేకుండా పోయింది.

నిలిచిన పనులు

చొప్పదండి పట్టణంలో సుమారు మూడు కిలోమీటర్ల మేర సెంట్రల్ లైటింగ్ పనులు చేసేందుకు గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు తెలంగాణ పట్టణాభివృద్ధి సంస్థ ద్వారా రుణం మంజూరై పనులు ప్రారంభించారు. పట్టణంలోని రాయపట్నం, కరీంనగర్ ప్రధాన రహదారిపై వంద అడుగుల రోడ్డును మూడు కిలోమీటర్ల మేర అభివృద్ధి చేస్తామని చెప్పిన అధికారులు.. రోడ్డు పొడుగును అంతకంటే తక్కువ దూరానికే కుదించారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు వేగంగా నిర్వహించిన పనులు ఎన్నికల ముందే పడకేశాయి. అసెంబ్లీ ఎన్నికల తర్వాత, పార్లమెంట్ ఎన్నికల తర్వాత కూడా పనులు తిరిగి ప్రారంభించకపోవడంతో.. ఎనిమిది నెలలుగా పనుల్లో పురోగతి లేక ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. పనుల ప్రారంభానికి ముందే రోడ్డు పక్కన వంద అడుగుల రోడ్డును ఆక్రమించి వేసిన నిర్మాణాలను తొలగించడంలో అధికారులు పక్షపాతం చూపినట్లు విమర్శలు వచ్చాయి. ఆపై డ్రైనేజీ నిర్మాణంలో నాణ్యతను అధికారులు పర్యవేక్షించడం లేదని ఆరోపణలు వచ్చాయి. అధికారులు కాంట్రాక్టర్లకు కొమ్ము కాయడంతోనే తారు రోడ్డు నిర్మించకుండా డివైడర్లు నిర్మించారని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. ఇంజనీరింగ్ పరిజ్ఞానం లేకుండా రోడ్డు పనులు ఎలా నిర్వహిస్తారని, రోడ్డు విస్తరించకుండా డివైడర్ నిర్మించడంపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇక విద్యుత్ టవర్ల నిర్మాణం కూడా ఆదిలోనే హంసపాదు అన్న చందంగా మారింది.

ఇరుగ్గా మారిన రోడ్డు

పట్టణంలోని ప్రధాన రోడ్డుపై గుమ్లాపూర్ ఎక్స్ రోడ్డు నుంచి డీ86 కాలువ సమీపం వరకు ప్రస్తుతం డివైడర్‌ను నిర్మించారు. ఇంతకుముందు 33 అడుగుల తారు రోడ్డు ఉండగా.. ఇదే తారుపై డివైడర్లను ఏర్పాటు చేయడంతో రోడ్డు ఇరుగ్గా మారింది. నిబంధనల ప్రకారం రోడ్డు సెంటర్ నుంచి ఇరువైపులా కనీసం ఏడు మీటర్ల మేర తారు నిర్మించాకే డివైడర్ ఏర్పాటు చేయాలని, ఈ నిబంధనలను అసెంబ్లీ ఎన్నికలకు ముందు తుంగలో తొక్కారని విమర్శలు వచ్చాయి. ఇక మట్టి రోడ్డును అభివృద్ధి చేయకపోవడంతో వ్యాపారులు రోడ్డును ఆక్రమించారు. రోడ్డుపై గుంతలు ఏర్పడి చిన్నపాటి వర్షాలకే నీటితో నిండిపోయి ప్రయాణికులు, వాహనదారులకు ఇబ్బందిగా మారాయి. వర్షాలు లేని సమయంలో రోడ్డుపై దుమ్ము లేసి తమ కళ్లలో పడుతోందని ప్రయాణికులు వాపోతున్నారు. అప్పుడప్పుడు రోడ్డు పనులపై సమీక్షలు జరగడం మినహా సౌకర్యంగా ఉన్న రోడ్డును అభివృద్ధి పేరుతో అధ్వానం చేశారని పట్టణ ప్రజలు వాపోతున్నారు. ఎమ్మెల్యేలు, ప్రభుత్వాలు, అధికారులు మారినా రోడ్డు పనుల్లో చలనం రావడం లేదని విమర్శలు వస్తున్నాయి.

మళ్లీ కొనసాగుతాయి

రోడ్డు విస్తరణ పనులు మళ్లీ కొనసాగుతాయి. ఇటీవల రోడ్డు పనులపై సమీక్ష సమావేశం జరిగింది. గుంతలుగా మారిన రోడ్డుపై మొరం కూడా పోశాం. రోడ్డు పనులకు సంబంధించిన అంశాలపై దృష్టి సారిస్తాం. టీయూఎఫ్‌ఐడీసీ అధికారులు నిధులు విడుదల చేయాల్సి ఉంది.

– నాగరాజు, మున్సిపల్ కమిషనర్, చొప్పదండి

వాగు దాటేందుకు భయంభయం..



శంకరపట్నం: అర్కండ్ల వాగు ప్రవహించడంతో నాట్లు వేసేందుకు మహిళలను రైతులు లోలెవల్ బ్రిడ్జిపై ట్రాక్టర్‌లో తీసుకెళ్లారు. నాలుగు రోజులుగా వాన పడడంతో ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు అర్కండ్ల వాగులో చేరుతోంది. లోలెవల్ బ్రిడ్జిపై నాచుతో మహిళలు నడుస్తున్నప్పుడు జారి వాగులో పడతామని భయపడుతున్నారు. వాగు దాటేందుకు భయపడడంతో ట్రాక్టర్లో మంగళవారం రైతులు పొలం పనులకు తీసుకెళ్లారు.

బీసీలకిచ్చిన హామీలు నెరవేర్చాలి



మానకొండూర్ రూరల్: తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

మానకొండూర్ రూరల్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 6నెలల్లోపు బీసీ కుల గణన చేపట్టి రిజర్వేషన్లను పెంచుతామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 7 నెలలు గడుస్తున్నా ఎలాంటి హామీలను నెరవేర్చలేదని నిరసిస్తూ మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. తక్షణమే 23 శాతం నుంచి 42 శాతానికి బీసీ రిజర్వేషన్లను పెంచాలని కోరారు. నాయకులు రంగు భాస్కరాచారి, ప్రవీణ్, రమేశ్‌పటేల్, బలరాం, సునంద్, రాజయ్య, శ్రీకాంత్, వైదిక్‌రావు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: ఎన్నికల సందర్భంగా బీసీ డిక్లరేషన్‌పై కామారెడ్డిలో కాంగ్రెస్ ఇచ్చిన హామీని అమలు చేయాలని బీజేపీ నాయకులు తహసీల్దార్ అనుపమకు వినతిపత్రం అందించారు. శ్రీనివాస్, సమ్మిరెడ్డి, సారయ్య, సాగర్ తదితరులున్నారు.

గంగాధర: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయడంలో విఫలమయిందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. మంగళవారం నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశానికి హాజరై మాట్లాడారు. నాయకులు పెరుక శ్రావణ్‌కుమార్, కోల అశోక్, శ్రీపతి చంద్రశేఖర్, ఎడవెల్లి శశిధర్‌రెడ్డి, మల్యాల వినయ్‌సాగర్, పంజాల ప్రశాంత్, రేండ్ల శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, నరసింహారెడ్డి, సుద్దాల రవీందర్‌రెడ్డి, ఇనుకొండ నర్సింహారెడ్డి, ఆకుల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల యాజమాన్యం పాటించాలి



చొప్పదండి: అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

చొప్పదండి: ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఎరువుల యాజమాన్యంపై దృష్టి సారించాలని ఏవో వంశీకృష్ణ కోరారు. పట్టణంలోని రైతు వేదికలో రైతులకు పంటల యాజమాన్యంపై అవగాహన సమావేశం నిర్వహించారు. శాస్త్రవేత్తలతో అవగాహన కల్పించారు. పంటల సాగులో మెళకువలు, ఎరవుల వాడకంలో పద్ధతులను వివరించారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రాష్ట్రస్థాయి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు వర్షాలతో పంటలకు వచ్చే చీడపీడలపై, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు సునీత, మండల వ్యవసాయ అధికారి జి.రజిత, వ్యవసాయ విస్తర్ణ అధికారులు ఎస్.తిరుపతి, రాకేశ్, మమత పాల్గొన్నారు.

రామడుగు: ఇటీవల కురుస్తున్న వర్షాలతో పత్తి పంటలో పలు తెగుళ్లు వస్తున్నాయని, నివారణ కోసం రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి యాస్మిన్ సూచించారు. దత్తోజీపల్లి గ్రామంలో మంగళవారం పత్తి పంటను పరిశీలించారు. పత్తి పంట ముంపునకు గురైతే మొక్కలు త్వరగా కోలుకోవాలంటే 19:19:19 లేదా 13:0:45 10 గ్రాములు లీటరు నీటికి లేదా యూరియా 10 గ్రాములు లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఏఈవో రాజేశ్, రైతులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి



మాట్లాడుతున్న కొండాల్‌రెడ్డి

హుజూరాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు మొండి చేయి చూపిందని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, పీఏసీఎస్ చైర్మన్ ఎడవెల్లి కొండాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బడ్జెట్‌లో అన్యాయం జరిగితే తెలంగాణ బీజేపీ ఎంపీలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

తెలంగాణకు అన్యాయం

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని బీఆర్‌ఎస్ యూత్ నియోజకవర్గ ఇన్‌చార్జి తొగరు శివకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి ప్రాధాన్యమివ్వాలి

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక ప్రాధాన్యమివ్వాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పొడిశెట్టి అభిలాష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యకు ప్రాధాన్యమివ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వమయినా ఈ బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని కోరారు.

వికసిత భారత్ లక్ష్యంగా కేంద్ర బడ్జెట్

కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వికసిత భారత్ లక్ష్యంగా ఉందని బీజేపీ మండల అధ్యక్షుడు రాముల కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి బడ్జెట్‌లో పెద్దపీట వేశారన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు అండగా మోదీ బడ్జెట్



మాట్లాడుతున్న సంపత్‌రావు

జమ్మికుంట: కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం మూడోసారి ఏర్పడ్డాక ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు అన్నారు. మంగళవారం పట్టణంలో విలేకర్లతో మాట్లాడారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి కేంద్ర బడ్జెట్ రైతులకు పెద్దపీట వేసిందన్నారు. మానవ వనరుల అభివృద్ధి, సామాజిక న్యాయం, ఉత్పత్తి సేవలు, పట్టణాభివృద్ధి, నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన, ఇంధన భద్రత, మౌలిక వసతులు, పరిశోధన, అత్యధిక సంస్కరణలు పరిధిలోకి తీసుకొని కేంద్ర బడ్జెట్‌ను రూపొందించి అన్ని వర్గాల ప్రజలకు పెద్దపీట వేసిందని అన్నారు. నాయకులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర: కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులతోపాటు ఎంపీలున్నా.. జాతీయ రహదారులు గాని, రైల్వేకు నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఏపీ, బీహార్ రాష్ట్రాలకు ఆ రాష్ట్ర ఎంపీలు రూ.వేల కోట్లు కేటాయించుకున్నారన్నారు. గతంలో బీఆర్‌ఎస్ ఎంపీలు కేంద్రంలో కొట్లాడి నిధులు తీసుకొచ్చారని అన్నారు. కొండగట్టు, వేములవాడ, యాదాద్రి, ధర్మపురి దేవాలయాలకు నిధులు తీసుకురావడంలో కేంద్ర మంత్రులు విఫలమయ్యారన్నారు.

యువకుడి అదృశ్యం

జమ్మికుంట: మోత్కులగూడెం గ్రామానికి చెందిన యువకుడు బండారి అశ్విన్ అదృశ్యం అయ్యాడు. టౌన్ సీఐ వి.రవి వివరాల ప్రకారం.. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెం గ్రామానికి చెందిన బండారి అశ్విన్ డిప్లొమా పూర్తిచేసి, రెండేళ్లుగా ఇంటివద్దే ఉంటున్నాడు. సోమవారం ఉదయం హైదరాబాద్ వెళ్లివస్తానని చెప్పి, ఇంటినుంచి వెళ్లి తిరిగిరాలేదు. ఫోన్‌చేసినా.. స్విచాఫ్ ఉందని యువకుడి తండ్రి బండారి మురళి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

బాధిత కుటుంబాలకు అండగా బీఆర్‌ఎస్



పోచమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కొత్త శ్రీనివాస్‌రెడ్డి

చిగురుమామిడి: సీతారాంపూర్ గ్రామంలో గోగూరి పోచమ్మ, చిగురుమామిడికి చెందిన ముడికె ఐలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా.. వారి కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య పరామర్శించారు. బాధిత కుటుంబాలకు బీఆర్‌ఎస్ వెన్నంటి ఉంటుందని భరోసా ఇచ్చారు. రైతు సమన్వయ సమితి మండల మాజీ అధ్యక్షుడు పెనుకుల తిరుపతి, నాయకులు శ్యామకూర సంపత్‌రెడ్డి, ముస్కుల సుధాకర్‌రెడ్డి, ఒంటెల ఇంద్రసేనారెడ్డి, ముసాపురి అశోక్, ముక్కెర సదానందం, అనిల్, శ్రీకాంత్, నాయకులున్నారు.

స్మితా సబర్వాల్ వ్యాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న బుచ్చిరాములు

జమ్మికుంట: సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ దివ్యాంగులను ఉద్దేశించి మాట్లాడడం తీవ్ర అభ్యంతరకరమని, తీవ్రంగా ఖండిస్తున్నామని మానసిక వికలాంగుల పేరెంట్స్ కమిటీ ప్రెసిడెంట్ సూత్రపు బుచ్చిరాములు అన్నారు. మంగళవారం పట్టణంలో విలేకర్లతో మాట్లాడారు. స్మితా సబర్వాల్ వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధంగా, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ఉన్నాయన్నారు.

క్షమాపణలు చెప్పాలి

వికలాంగుల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేసిన స్మితా సబర్వాల్ క్షమాపణలు చెప్పాలని వికలాంగ సంఘం అధ్యక్షుడు నేరుపాటి రవి, ప్రధాన కార్యదర్శి రమేశ్, కోశాధికారి ముత్యాల రంగయ్య, సహాయ కార్యదర్శి పొన్నాల రాజయ్య, కార్యవర్గ సభ్యులు సాంబయ్య, రాజభద్రయ్య డిమాండ్ చేశారు.

ఇల్లందకుంట: ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని వికలాంగుల సంక్షేమ సేవాసంఘం మండల నాయకుడు మొగిలిపాక శ్రీనివాస్‌గౌడ్ అన్నారు.

వీణవంక: వికలాంగులపై ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ శ్రీసాయి ఆదర్శ వికలాంగుల సేవాసంఘం సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పైడిమల్ల శ్రీనివాస్, నలబాల కుమారస్వామి, పులి ప్రకాశ్, వెంకటాచలం, గిరవేన సమ్మయ్య, సబ్బని శ్రీనివాస్, పెరమాండ్ల రాజయ్య తదితరులున్నారు.

గంజాయిరహిత సమాజానికి కృషి చేయాలి



చిన్నముల్కనూర్‌లో మాట్లాడుతున్న సీఐ స్వామి, ఎస్‌ఐ రాజేశ్


చిగురుమామిడి: సమాజం కోసం పని చేయాల్సిన యువతీయువకులు కొందరు గంజాయికి బానిసలైపోతున్నారని తిమ్మాపూర్ సీఐ స్వామి అన్నారు. మంగళవారం సాయంత్రం చిగురుమామిడి ఎస్సై రాజేశ్‌తో కలిసి చిన్నముల్కనూర్‌లో గ్రామస్తులతో సైబర్ నేరాల అప్రమత్తతపై అవగాహన సమావేశం నిర్వహించారు. గంజాయిరహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు.

మొరాయించిన రైల్వే గేట్



రామడుగు: వెదిర గ్రామ శివారులో వెంకటగిరి సమీపాన ఉన్న రైల్వే గేట్ మంగళవారం సాయంత్రం మొరాయించడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. కరీంనగర్ నుంచి జగిత్యాల వెళ్లే రైలు కోసం గార్డు రైల్వే గేట్‌ను వేశాడు. రైలు వెళ్లిన తర్వాత గేటు ఎంతకు లేవకపోవడంతో వాహనాలు నిలిచిపోయాయి. గోపాల్‌రావుపేట నుంచి కరీంనగర్, కరీంనగర్ నుంచి గోపాల్‌రావుపేట, రామడుగు వెళ్లే వాహనదారులు అవస్థలు పడ్డారు. పలువురు ఇతర మార్గాల ద్వారా వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. తర్వాత మరమ్మతులు చేయడంతో వాహనాలు యధావిధిగా వెళ్లాయి.

వసతి గృహాల్లో వార్డెన్లను నియమించాలి



జిల్లా అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న శ్రీధర్‌రెడ్డి

హుజూరాబాద్: ప్రభుత్వ వసతి గృహాల్లో హాస్టల్ వార్డెన్లను నియమించాలని తెలంగాణ విద్యార్థి యువజన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కర్ర శ్రీధర్‌రెడ్డి మంగళవారం వెనకబడిన తరగతుల జిల్లా అధికారి ప్రకాశ్‌కు వినతిపత్రం సమర్పించారు. వసతి గృహాల్లో కనీస మౌలిక వసతుల్లేవని, రెగ్యులర్ వార్డెన్ లేక పేద విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రసాద్, రమేశ్ ఉన్నారు.